క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ గణేష్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐగా టి.గణేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి టూటౌన్ స్టేషన్ నుంచి విజయవాడ కమిషనరేట్ పరిధిలోకి బదిలీపై వచ్చిన గణేష్‌ను కొత్తపేట సీఐగా నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా నియమించారు. ఈ మేరకు గురువారం స్టేషన్‌కు విచ్చేసిన గణేష్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్టేషన్ ఎస్‌ఐలతో ముఖాముఖి నిర్వహించారు. కొత్తపేట సీఐగా బాధ్యతలు నిర్వహించిన సుబ్రహ్మణ్యం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం రేంజ్‌లోని తాడేపల్లి గూడెం టౌన్ సీఐగా బదిలీ అయ్యారు. ఆయన బుధవారం అక్కడకు వెళ్లి సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

నేడు మెగా హెల్త్ క్యాంపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తినగర్ రత్నమాంబ వీధిలోని మురళీకృష్ణ కేర్ అండ్ క్యూర్ హాస్పటల్‌లో శుక్రవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత జనరల్ ఫిజిషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ టీవీ మురళీకృష్ణ తెలిపారు. ఈ క్యాంప్‌లో ఉచిత కన్సల్టేషన్‌లో పాటు మధుమేహం (ఆర్‌బీఎస్), కొలెస్ట్రాల్, థైరాయిడ్ (టీఎస్‌హెచ్), బ్లడ్ యూరియా, కిడ్నీ పరీక్ష, లివర్ పరీక్ష, ఇసీజీ వంటివి ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో త్రినయన ఐ కేర్‌కు చెందిన డాక్టర్ సి.త్రివేణి పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అంతే కాకుండా రాయితీపై టోటల్ బాడీ చెకప్‌కు సంబంధించి ప్రత్యేక ప్యాకేజీ పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. కళ్లజోళ్లు కూడా 50 శాతం వరకూ రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారు 7981643518 నంబర్లో సంప్రదించాలని కోరారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన మద్దినేని పవన్‌కుమార్ డెలివరీ కంపెనీలో పని చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం సింగ్‌నగర్‌లో తెలిసిన వ్యక్తి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇన్నర్ రింగ్‌లోని ఆల్ఫా హోటల్ వద్ద వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో పవన్‌కుమార్‌కు గాయాలు కాగా భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.4.10 లక్షల స్వాధీనం

ఉంగుటూరు: ఎటువంటి ఆధారాలు లేని రూ.4.10 లక్షల నగదును తీసుకువెళ్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య నేతృత్వంలో హనుమాన్ జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి ఆదేశాల మేరకు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పిడుగురాళ్ల నుంచి రావులపాలెం వెళ్తున్న కారులో రూ.4,10,000 నగదును గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవడంతో స్టేషన్‌కు తరలించి నగదును స్వాధీనపరచుకుని సీజ్ చేశారు.

తలనీలాల వేలం ఆదాయం రూ.11.20 లక్షలు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునే హక్కునకు గురువారం వేలం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన బొజ్జా శ్రీనివాసరావు అత్యధికంగా పాడి వేలం దక్కించుకున్నాడు. వేలం ద్వారా రూ.11.20 లక్షల ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఈ నెల 26 నుంచి డిసెంబరు 31 వరకు ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునే హక్కు వారికి కలిగింది. తిరువూరు గ్రూపు దేవాలయాల మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

పోచంపల్లి(జగ్గయ్యపేట): పంటల సాగులో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని కేవీకె ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. గ్రామంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం రైతుసదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కెవీకెలో క్షేత్ర స్థాయిలో వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మెలకువలు తెలుసుకోవచ్చన్నారు.

పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధానికి 'సిద్ధం' కావాలి

పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్లు మర్రి రాజశేఖర్, అయోధ్య రామిరెడ్డి





ఆత్మీయ సమావేశంలో సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, షేక్ ఆసిఫ్ తదితరులు, హాజరైన కార్యకర్తలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని పేదలు, పెత్తందార్లకు మధ్య జరగబోయే ఎన్నికల యుద్ధానికి అంతా సిద్ధమా.. సిద్ధమా అంటూ వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్లు మర్రి రాజశేఖర రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. అంతకంటే రెట్టించిన ఉత్సాహంతో వారంతా 'సిద్ధమే' అని ఎలుగెత్తి చాటారు. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్లో గురువారం సాయంత్రం నిర్వహించిన పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లకుపైగా కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని రానున్న ఎన్నికల్లో ఓట్లుగా మలుచుకోవాలని కోరారు. ప్రజలకు మేలు జరిగితేనే తమకు ఓట్లు వెయ్యమని ధైర్యంగా అడగగలిగిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో దళారులు ఉన్న గత ప్రభుత్వ పాలన మాదిరిగా కాకుండా కులం, మతం, పార్టీ, వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) రానున్న 5 ఏళ్లలో మరిన్ని సేవలు అందించేందుకు ఆయా నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న ఏలూరు జిల్లాలో జరగనున్న పార్టీ కార్యకర్తల సమావేశంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని, ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అక్కడ జగనన్న పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేస్తారని చెప్పారు.

చెప్పింది చెయ్యటమే ఒక ఆయుధం...

ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏం చెప్పారో అదే చేశారని, రాబోయే ఎన్నికల్లో అదే ఒక ఆయుధమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు పార్టీ ప్రజాప్రతినిధులంతా జవాబుదారీతనంగా ఉండటం వలనే నూటికి 99 మార్కులు వచ్చాయని అన్నారు. పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు మనమంతా అండగా ఉండి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించానని చెప్పారు. ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలో నిర్మించనున్న స్టేడియంకు వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంగా నామకరణం చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ కమిట్‌మెంట్ ఉన్న నాయకుడని, అతన్ని గెలిపించి నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడేలా చెయ్యాలని కోరారు.

పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కంచుకోట

పశ్చిమ నియోజకవర్గంలో 1983లో తప్ప తరువాత కాలంలో టీడీపీ గెలిచింది లేదని, ఇది వైఎస్సార్ సీపీ కంచుకోట అని ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. రాజకీయ పరిణితిగల ఇటువంటి నియోజకవర్గాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో చూడలేదని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అంబేడ్కర్‌కు లభించిన గౌరవం ఏపీలో మాత్రమే దక్కిందని, అది సీఎం వైఎస్ జగన్ వలనే సాధ్యమయ్యిందని పేర్కొన్నారు. తాజ్‌మహల్ కట్టిన షాజహాన్‌కు ఎంత పేరు వచ్చిందో తనకూ అలాగే రావాలని చంద్రబాబు అమరావతిని కట్టేందుకు యత్నించాడని, అది కేవలం చంద్రబాబు, అతని కొడుకు లోకేష్‌ల రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తప్ప మరో 50 ఏళ్లయినా అభివృద్ధి కాదని అన్నారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మోదీకి తాను అదే చెప్పానని గుర్తు చేశారు. టీడీపీ తనను చాలా అవమానకరంగా బయటకు పంపితే సీఎం వైఎస్ జగన్ ప్రేమతో అక్కున చేర్చుకున్నారని చెప్పారు.

సీఎం జగనన్న ద్వారా తెలుసుకున్నాను...

మనం చేసేది మంచి పనయితే, అదీ పట్టుదలతో చేస్తే విజయం తథ్యమని సీఎం వైఎస్ జగనన్న ద్వారా తెలుసుకున్నానని కార్యక్రమ నిర్వాహకుడు, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. కార్పొరేటర్ స్థాయి నుంచి నియోజకవర్గ బాధ్యతలను అప్పగించే స్థాయి వరకు ప్రోత్సహించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటానని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఏదో ఒక రోజు తగిన గుర్తింపు లభిస్తుందని, అందుకు తానే నిదర్శనమని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.2 లక్షల చెక్ అందజేత



చెక్ అందచేస్తున్న రత్నకుమారి, రెహమాన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన కింద అనారోగ్యంతో మరణించిన కోసూరి లక్ష్మి కుటుంబ సభ్యులకు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి రూ.2 లక్షల చెక్‌ను గురువారం అందచేశారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీలో నివసించే కోసూరు లక్ష్మి విజయవాడ రూరల్ జక్కంపూడిలో ఎస్తేరు ఎమ్‌డీజీ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. ఆమె సుమారు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన బీమా పథకం కింద ఇటీవల రెండు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఆ మొత్తాని చెక్కు రూపంలో విద్యాధరపురం లేబర్ కాలనీలోగల నగర పాలక సంస్థకు చెందిన కల్యాణమండపంలో మృతురాలి నామినీ అయిన భర్త చంద్ర నాగ వెంకటేశ్వర్లుకు కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జక్కంపూడి బ్రాంచి మేనేజర్ రెహమాన్ అందచేశారు. కార్యక్రమంలో ఆర్‌పీ ఉమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ ఖాయం

- విజయవాడ నగరం వైఎస్సార్ సీపీ కంచుకోట కానుంది
- విజయవాడ ఎంపీ కేశినేని నాని



సభలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయనుందని, విజయవాడ నగరం వైఎస్సార్ సీపీ కంచుకోటగా అవతరించనుందని విజయవాడ ఎంపీ కేశినేని నాని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం సింగ్ నగర్ ఆంధ్రప్రభ కాలనీలో గురువారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఎండీ రుహుల్లాతో కలిసి ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ గత ఎన్నికల్లో 25 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా మల్లాది విష్ణు విజయం సాధించారని, కానీ ఈసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఏకంగా 25 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి తీరుతారన్నారు. చంద్రబాబుది అంతా స్వార్థ రాజకీయమేనని, తరతరాలు తామే ఏలాలి, తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలనే తప్ప రాష్ట్ర అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోరని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడంతో పాటు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మాట ఇస్తే మోసం చేసే వ్యక్తి చంద్రబాబు అని, మాట ఇస్తే నిలబెట్టుకునే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో భూకబ్జాదారుడు, బ్లాక్ మెయిలర్, స్వాతంత్ర్య సమర యోధుల భూములను సైతం కాజేసిన బొండా ఉమాలాంటి వ్యక్తికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో గెలిచే తొలి సీటు సెంట్రలే మల్లాది విష్ణు

జిల్లాలో వైఎస్సార్ సీపీ గెలిచే మొట్టమొదటి సీటు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గమేనని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వెలంపల్లి శ్రీనివాస్ గెలుపునకు తన పూర్తి సహకారం ఉంటుందని, జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పడతాయని చెప్పారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జూపూడి ప్రభాకర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ తదితరులు హాజరయ్యారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటు హక్కుపై యువత చైతన్యవంతం కావాలని అప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి అన్నారు. కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పతకం(ఎన్ఎస్ఎస్) విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా ప్రధానమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు ఆయుధంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో వివిధ స్థాయిల్లో జరిగే ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఓటు హక్కును తెలియజేసేందుకు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఓటరు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. ఓటు విశిష్టతను విద్యార్థులు తమ చుట్టూ ఉన్న ప్రజలకు తెలియజేసి వారిని జాగృతం చేయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ యావత్ ఓటుపై ఆధారపడి ఉంటుందన్నారు. మంచి పాలకులను ఎన్నుకొని తద్వారా మంచి అభివృధిని సాధించేందుకు ఓటు హక్కును చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎక్కువ పర్యాయాలు ఓటు వేసిన సీనియర్ సిటిజన్, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తిని సత్కరించారు. కొత్తగా ఓటు నమోదైన వారికి ఐడీకార్డును అందించారు. ఈ సభలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రొగ్రామ్ ఆఫీసర్ వి.శేషగిరిరావు స్వాగతం పలకగా, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం



శానిటరీ ఆఫీస్ నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్న కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతంలోని విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో శానిటరీ కార్యాలయం నిర్మాణ పనులకు కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. డివిజన్ పరిధిలోగల ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ పక్కనగల ఖాళీ స్థలంలో రూ.3లక్షల వ్యయంతో నిర్మించనున్న శానీటరీ ఆఫీస్‌కు కార్పొరేటర్ రెహమతున్నీసా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 38వ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనులను నిర్వహించే శానిటరీ సిబ్బందికి ప్రస్తుతం మల్లికార్జునపేటలో ఉన్న శానిటరీ కార్యాలయం చిన్నది కావడంతో వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అంతే కాకుండా గట్టు వెనుక ప్రాంతంలో విధులు నిర్వహించే శానిటరీ సిబ్బంది మస్తరు కోసం మల్లికార్జునపేట వెళ్లి తిరిగి ఇక్కడకి చేరుకునేందుకు సమయం వృథా అవుతున్న నేపథ్యంలో ఇక్కడ ఒక శానిటరీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీంతో ఆ ప్రాంతంలో పని చేసే సిబ్బంది అక్కడ, ఈ ప్రాంతంలో పని చేసే సిబ్బంది ఇక్కడ మస్తరు వేసేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడే శానిటరీ సిబ్బంది ఇబ్బందులను కూడా పట్టించుకోవల్సిన అవసరం ఉన్నందున ఆఫీస్ నిర్మాణాన్ని తలపెట్టామన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



విజేత జట్లకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఆడుదాం ఆంధ్రా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. నియోజకవర్గంలోని కేబీఎన్ కాలేజీ, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీ, అట్కిన్‌సన్ స్కూల్, గాంధీజీ ఇండోర్ స్టేడియంలలో ఈ నెల 24, 25 తేదీల్లో పోటీలు నిర్వహించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో మండల స్థాయి పోటీల్లో విజేత జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాయి. కేబీఎన్ కాలేజీలో జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేత జట్లకు 50వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విజయ, కార్పొరేటర్ సత్తిబాబు, కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందజేశారు.

విజేతలు వీరే....

క్రికెట్ పురుషుల విభాగంలో 40, 50, 46వ సచివాలయాలు, మహిళల విభాగంలో 34, 50, 44 సచివాలయాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో 35, 51, 42, మహిళల విభాగంలో 50, 40, 34, కబడ్డీ పురుషుల విభాగంలో 50, 46, 43, ఖోఖో పురుషుల విభాగంలో 50, 40, 49, మహిళల విభాగంలో 50, 46, 42, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో 44,35,54, మహిళల విభాగంలో 35,50,41 సచివాలయాల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. ఆయా క్రీడాంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు ఈ నెల 31వ తేదీ నుంచి జరిగే జిల్లా స్థాయి పోటీలకు పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయి.

మల్లయ్యస్వామికి ఎంపీ కేశినేని నాని ప్రత్యేక పూజలు



కొండపర్వ (విస్సన్నపేట): కొండపర్వ గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి (మల్లయ్య స్వామి) దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాసరావు (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు జి. చంద్రశేఖరరావు వారికి స్వాగతం పలికారు. అనంతరం పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్ బాబు, ఈఓ సీతారామయ్యలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. సూర్యనారాయణరెడ్డి, మెర్సీవనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు సాహిత్యసేవలు వెలకట్టలేనివి

విజయవాడ కల్చరల్: సత్య శ్రీనివాసరాజు సాహిత్య సేవలు వెలకట్టలేనివని ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. అమ్మ కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు, రచయిత, సమాజ సేవకుడు శ్రీనివాసరాజు సంతాప సభను గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయం మినీ హాల్‌లో గురువారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన కొల్లూరి మాట్లాడుతూ శ్రీనివాసరాజుకు, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థకు విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు.

వీఎంసీ బడ్జెట్‌పై కమిషనర్ సమీక్ష



బడ్జెట్‌పై సమీక్షిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పాల్గొన్న అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా, నగరాభివృద్ధే లక్ష్యంగా 2024-25 ఆర్థిక ఏడాదికి వీఎంసీ బడ్జెట్ ఉండాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో అన్ని శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024-2025 సంవత్సరపు అంచనాలు అభివృద్ధికి ప్రతీకగా ఉండాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో కేటాయించిన బడ్జెట్ రాబోవు కాలానికి అవసరమైన బడ్జెట్ గురించి చర్చించారు. అధికారులకు నగరాభివృద్ధిపై తగు సూచనలు చేసి, ప్రజా ప్రయోజనాల గురించి అవసరమయ్యే పనులకు తగిన బడ్జెట్ ప్రతిపాదనలతో మరోసారి సమీక్ష సమావేశంలో నివేదికను తనకు అందించాలని ఆదేశించారు.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడస్పోర్ట్స్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో బెంజిసర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా, రెడ్‌సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్, శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరి జంక్షన్ వరకు కేవలం ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తామని, ఇతర వాహనాలను అనుమతించమని స్పష్టం చేశారు.

వాహనాల దారి మళ్లింపు ఇలా..

ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి బెంజిసర్కిల్‌కు స్వర్ణప్యాలెస్, దీప్తిసెంటర్, పుష్పా హోటల్, జమ్మిచెట్టుసెంటర్, సిద్ధార్థ జంక్షన్ మీదుగా ఒక మార్గంగా, బందరు లాకులు, రాఘవయ్యపార్క్, అమెరికల్ ఆసుపత్రి, నేతాజీబ్రిడ్జి, స్క్రూబ్రిడ్జి మీదుగా మరో మార్గంగా రాకపోకలు సాగించాలి. ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి ఏలూరు రోడ్డు, ఐదో నెంబర్ రూట్ మీదుగా మాత్రమే రాకపోకలు సాగించాలి.

పార్కింగ్ ప్రదేశాలు..

ఏఏ పాస్‌లు కలిగిన వారు మూడో నెంబర్ గేట్ నుంచి, ఏ1 పాస్‌లు కలిగిన వారు నాల్గో నెంబర్ గేటు నుంచి, బీ1 పాస్‌లు కలిగిన వారు ఆరో నెంబర్ గేటు నుంచి, ఐఏఎస్ అధికారులు, మీడియా ప్రతినిధులు రెండో నెంబర్ గేటు ద్వారా స్టేడియంలోకి ప్రవేశించి నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. నున్న, సింగ్‌నగర్, సత్యనారాయణపురం, మాచవరం వైపు నుంచి వచ్చే విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు రెడ్‌సర్కిల్ వద్దనున్న బిషప్ అజరయ్య స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి. పటమట వైపు నుంచి విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు.. విద్యార్థులను స్టేడియం వద్ద దింపి బస్సులను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి.

28న చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరానికి చెందిన సీనియర్ చిత్రకారుడు, చిత్రకళా తపస్వి వేముల కామేశ్వరరావు శత వసంతాల సందర్భంగా ఈ నెల 28వ తేదీన గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్ తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో గురువారం చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కామేశ్వరరావు గీసిన చిత్ర కళాప్రదర్శన, 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు చిత్రకళా ప్రదర్శనను యువజన సంక్షేమ శాఖాధికారి యు.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉపాధ్యక్షుడు గిరిధర్ అరసవల్లి, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, సంధ్యారాణి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.